
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
బుధవారం 5 ఫిబ్రవరి 2025







మీ టీడీపీ ఇన్‌చార్జ్ పనితీరు ఎలా వుంది ?

'మీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పనితీరు ఎలా వుంది ? బాగుంది, బాగాలేదు. పర్వాలేదు' అంటూ పార్టీ అధిష్ఠానం ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్(ఐవీఆర్) ద్వారా ఫోన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. దీని ద్వారా ఎక్కడైనా ఇన్‌చార్జ్‌ల పనితీరు బాగా లేకపోతే మార్చే అవకాశం ఉంటుంది. మరోవైపు ఎమ్మెల్యేల పనితీరుపైన ఇంటెలిజెన్స్ ద్వారా ఆరా తీసింది.

- 7లో..



వింత వైరస్‌తో లక్షల్లో కోళ్లు మృత్యువాత!

ఉమ్మడి పశ్చిమలో కోళ్లకు ఏమైంది. సంక్రాంతి ముందు పందెం కోళ్లు, ఇప్పుడు ఫారం కోళ్లు పిట్టల్లా రాలిపోతున్నాయి. అంతు చిక్కని వైరస్‌తో లక్షల్లో చనిపోతున్నాయి. ఎక్కడికక్కడ వీటిని గోతులు తీసి పూడుస్తున్నారు. మరోవైపు కోడి గుడ్ల ఉత్పత్తి పడిపోయింది. దీనిపై పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 7లో



ఎంఆర్ఐ స్కానింగ్‌తో ఆగిన మహిళ గుండె !

ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్ నిర్వాహకుల నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైంది. గుండెకు పేస్ మేకర్ వున్న మహిళకు స్కానింగ్ చేసి ఆమె మృత్యువుకు కారణమయ్యారు. భార్య మిషన్‌లో విలవిలలాడుతూ ఊపిరి వదలడంతో భర్త కన్నీరు మున్నీరుగా విలపించారు. ఏలూరు సుస్మిత డయోగ్నోస్టిక్ సెంటర్‌లో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలు

- మెయిన్‌లో

అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మ వార్లను పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేస్తున్న అర్చకులు


6

ఓం అరుణాయ.. వేంకటేశాయ నమః



జిల్లావ్యాప్తంగా మంగళవారం రథ సప్తమి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే సూర్యుడికి ప్రణమిల్లి పూజలు చేశారు. తణుకు శ్రీ సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రథ సప్తమి సందర్భంగా ద్వారకాతిరుమలలో ఉభయ దేవేరులతో శ్రీ వేంకటేశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై ఊరేగారు.

ఫీజులు చెల్లించారు



జిల్లాలో కళాశాలలకు రూ.25 కోట్లు రీయింబర్స్‌మెంట్

- తొలి త్రైమాసిక ఫీజు విడుదల
- కళాశాలల యాజమాన్యాలకు ఊరట
- ఈబీసీ విద్యార్థులకు పెండింగ్.. త్వరలోనే మంజూరు చేసే అవకాశం
- వైసీపీ పెట్టిన బకాయిలపైనా తర్జన భర్జన

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కళాశాలలకు కాస్త ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసింది. వైసీపీ హయాంలో బకాయిలను తాత్కాలికంగా పక్కన పెట్టింది. అవి ఎవరి ఖాతాలో జమ చేయాలన్న విషయమై ప్రభుత్వ స్థాయిలో మీమాంస నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాలల ఖాతాలో జమ చేస్తామని స్పష్టం చేసింది. దీనికి అనుగుణంగా 2024-25 విద్యా సంవత్సరంలో తొలి త్రైమాసిక ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కళాశాలల ఖాతాలో జమ చేసింది. దీనివల్ల కళాశాలలకు కాస్త ఉపశమనం లభించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి సొమ్ములను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ-బీసీ విద్యార్థులు అంటే జనరల్ కేటగిరిలో ఆర్థికంగా వెనుకపడిన విద్యార్థులకు ఇంకా ఫీజు చెల్లించలేదు. రాష్ట్రవ్యాప్తంగా రూ.200 కోట్లను ఇదే కేటగిరీ కింద జమ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజులను విడుదల చేశారు.

జిల్లాలో కళాశాలలకు ప్రభుత్వం రూ.25 కోట్లు జమ చేసింది. మరో రూ.15 కోట్లు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటోంది. వైసీపీ హయాంలో బకాయిలపైనే ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వాటిని కళాశాలలకు చెల్లించేలా చర్యలు తీసుకుంటే విద్యార్థులకు ఊరట లభిస్తుంది. చివరి సంవత్సరం విద్యార్థులు ఈ ఏడాది చదువు పూర్తి చేసుకుని వెళ్లిపోయారు. సొంత సొమ్ములు చెల్లించారు. ఇలా ఫీజులు చెల్లించిన విద్యార్థుల విషయంలోనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ఎస్‌సి విద్యార్థులకు సొంత ఖాతాలోనే

వైసీపీ హయాంలో చేసిన తప్పిదాలు ఇప్పటికీ వెంటాడుతున్నాయి. కరోనా సమయంలో గత ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన ఫీజులను దారి మళ్లించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి సౌకర్యాలకు సంబంధించి 60 శాతం సొమ్మును కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది. మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రం తన వంతుగా 60 శాతం ఫీజును సకాలంలో విడుదల చేస్తోంది. కరోనా సమయంలో వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించడంతో సమస్య ఏర్పడింది. పైగా కేంద్రం నుంచి సొమ్ములు తీసుకుని విద్యార్థులకు చెల్లించలేదు. అందులోనూ ఒక క్వార్టర్ సొమ్మును పూర్తిగా ఎగనామం పెట్టింది. ఫలితంగా విద్యార్థులే ఆ సొమ్మును చెల్లించుకున్నారు. అప్పటి నుంచి కేంద్రం చెల్లించే ఫీజుకు సంబంధించి వినియోగ ధ్రువీకరణ పత్రాలను సమర్పించడం లేదు. ఫలితంగా కేంద్రం సకాలంలో ఎస్సీ విద్యార్థులకు ఫీజును విడుదల చేయడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈసారి ఎస్సీ విద్యార్థులకు తన వంతు 40 శాతం సొమ్మును వారి తల్లుల ఖాతాకే చెల్లించింది. ఇది గత బకాయికి సంబంధించిన సొమ్ము అని చెబుతున్నప్పటికీ ప్రస్తుత విద్యా సంవత్సరంలో తొలి త్రైమాసిక సొమ్ముగానే కళాశాలలకు సంకేతం అందింది. ప్రభుత్వం కళాశాలల ఖాతాలో బీసీ, ఎస్టీ విద్యార్థులకు జమ చేసిన సొమ్మును లెక్కలు వేసుకుంటే ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల సొమ్ముగానే తేలింది. వైసీపీ హయాంలో బకాయిపడ్డ సొమ్మును ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

అప్పుడు బకాయి.. ఇప్పుడు హడావిడి

వైసీపీ హయాంలో కోట్ల రూపాయలు బకాయి పెట్టారు. అప్పట్లో బటన్ నొక్కారు. సొమ్మును మాత్రం తల్లుల ఖాతాలో జమ చేయలేదు. ఇలా జిల్లాలో కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రక్షాళన చేపట్టింది. తల్లుల ఖాతాలో వేస్తే ఎదురవుతున్న సమస్యలను పరిగణనలోకి తీసుకుంది. సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా కళాశాలలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయి. లేదంటే సొమ్ములు చెల్లించి సర్టిఫికెట్‌లు తీసుకోవాలని స్పష్టం చేస్తున్నాయి. విద్యార్థులపై అలాంటి ఒత్తిడి లేకుండా ఎప్పటిలాగే కళాశాలల ఖాతాలో జమ చేసేందుకు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బకాయిల్లో తొలి త్రైమాసిక ఫీజులను విడుదల చేయడానికి చర్యలు చేపట్టింది. ఈ-బీసీ విద్యార్థులకు మాత్రమే చెల్లించాలి. మిగిలిన వారికి జమ చేసింది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్, జనసేన, బీజేపీ జిల్లా అధ్యక్షులు గోవిందరావు, శ్రీదేవి, ఎమ్మెల్యే నాయకర్, మాజీ మంత్రి సుజాత

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి గెలవాల్సిందే

- జిల్లా నేతలకు ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి దిశా నిర్దేశం

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):'ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలవాల్సిందే. 'నాయకుల మధ్య సమన్వయం లోపం ఉండకూడదు. ఆయన గెలుపునకు కూటమి నాయకులు బాధ్యత తీసుకుని సీరియస్‌గా పనిచేయాలి' అని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మంగళవారం భీమవరంలో జిల్లా కూటమి నేతలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి. ఎన్నికల కోడ్ ముగియగానే మెగా డీఎస్సీ నిర్వహించి, వచ్చే విద్యా సంవత్సరానికి జాయినింగ్ లెటర్లు అందిస్తాం. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తాం' అని తెలిపారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి నాయకులు ప్రభుత్వ ప్రైవేటు కళశాలల్లోని ఉద్యోగులకు, పట్టభద్రులకు ఎన్డీఏ ప్రభుత్వ పనితీరు వివరించి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రచారం చేయాలన్నారు. పొలిట్‌బ్యూరో సభ్యురాలు సీతా రామలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేస్తామన్నారు. ఏపీఐఐసీ చైర్మన్, జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు మాట్లాడుతూ పట్టభద్రుల జాబితాలోని ప్రతి 30 మంది ఓటర్లకు కూటమి ప్రతినిధిని నియమించి స్థానిక నాయకులతో ప్రచారం నిర్వహించాలన్నారు. అభ్యర్థి రాజశేఖరం మండలిలో కూటమి బలం పెరగాల్సిన అవసరాన్ని వివరించారు. ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, బీజేపీ అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, కన్స్యూమర్ ప్రొటెక్షన్ చైర్మన్ పీతల సుజాత, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూరి తదితరులు పాల్గొన్నారు.



సుర్రుమన్న సూరీడు

రథసప్తమి రోజున మండిన ఎండ.. జనం ఆపసోపాలు

భీమవరం టౌన్/పెంటపాడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథ సప్తమి రోజు మంగళవారం జిల్లాలో సూర్యుడు ప్రతాపం చూపించాడు. నిన్నటి వరకు ఉదయం చలి గాలులు, పొగ మంచుతో ప్రజలను ఇబ్బంది పెట్టిన వాతావరణం మంగళవారం మారిపోయింది. ఉదయం పది గంటల నుంచే ఉక్కబోత మొదలైంది. ఎండలో నిల్చుంటే చురుక్కుమంది. వేసవి మొదలైందన్న భావన ప్రజల్లో వ్యక్తమైంది. ఉష్ణోగ్రత 34 డిగ్రీలు నమోదైంది. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి. రోడ్లపైకి వచ్చిన వారంతా ముఖానికి, చెవులకు ముసుగులు వేసుకున్నారు. ఈ నెల 26న వచ్చే శివరాత్రి దాటిన తరువాత భానుడి ప్రతాపం ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో కొద్దిరోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నం సమయంలో ఈ డిమాండ్ కనిపిస్తుందని ఎండ తీవ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో సమస్యలు రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు.

మార్కెట్‌లో చల్లని పానీయాలకు డిమాండ్ పెరుగుతోంది. రోడ్ల పక్కన జ్యూస్ స్టాల్స్ వెలుస్తున్నాయి. రానున్న రోజుల్లో వీటి సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి. చాలా మంది పండ్ల రసాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో వాటి అమ్మకాలు బాగున్నాయని పేర్కొంటున్నారు.

6న పీడీఎస్ బియ్యం బహిరంగ వేలం

భీమవరంటౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిల్వ ఉన్న 48.330 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యాన్ని ఫిబ్రవరి 6న బహిరంగ వేలం వేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి మంగళవారం తెలిపారు. వివిధ 6ఏ కేసులలో సీజ్ చేసి ఈ బియ్యాన్ని ఉండి ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిల్వ చేశారు. విచారణ అనంతరం 6ఏ కేసులు ముగియడంతో ఈ బియ్యాన్ని కిలో రూ.20 చొప్పున ధర నిర్ణయించి బహిరంగ వేలం ద్వారా అమ్మకానికి ఉంచామన్నారు. ఆరో తేదీ ఉదయం 11 గంటలకు ఉండి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

ఢిల్లీకి కొల్లేరు సమస్య

కైకలూరు/ఏలూరు టూ టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):కొల్లేరులో జిరాయితీ, సొసైటీ భూములను తిరిగి ప్రజలకు ఇప్పించేలా న్యాయపోరాటం చేస్తామని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ ఇచ్చిన హామీ మేరకు కొల్లేరు పంచాయతీ ఢిల్లీకి చేరింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొల్లేరులో ఇటీవల అటవీశాఖ అధికారులు ఆక్రమణలను తొలగించారు. సొసైటీ, జిరాయితీ భూములను కాంటూరు సరిహద్దులను దాటి ధ్వంసం చేశారు. ఎంపీ సుప్రీంకోర్టులో పోరాటం చేసేందుకు జిల్లా కొల్లేరు సంఘ నాయకులతో కలిసి మంగళవారం ఢిల్లీలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నాగేశ్వరరెడ్డిని కలిశారు. కొల్లేరులో ధ్వంసం చేసిన 15 వేల ఎకరాల జిరాయితీ భూములు వెనక్కి ఇవ్వడంపై రిట్ పిటిషన్‌ను దాఖలు చేశారు. వాదనలు వినిపించాలని కోరారు.

రక్షితం కాదు.. గరళం!



ఆకివీడు మునిసిపాలిటీ ప్రజలకు కలుషిత నీరే దిక్కు!

- ఫిల్టర్ బెడ్‌ల మరమ్మతులకు ఐదేళ్లుగా ఒక్కపైసా ఇవ్వని ప్రభుత్వం
- నిధులు లేక కాంట్రాక్టర్ల వెనుకంజ
- పనులు చేయలేక ఇదే నీటిని సరఫరా చేస్తున్న నగర పంచాయతీ

ఆకివీడు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆకివీడు పట్టణ ప్రజలకు సరఫరా అయ్యేది రక్షిత నీరు కాదు.. గరళం..! పేరుకు మాత్రం మంచినీరు.. తాగడానికి మాత్రం ఎందుకూ పనికి రాదు. దీంతో ప్రజలు బయట కొనుగోలు చేస్తున్నారు. నగర పంచాయతీ పరిధిలో 20 వార్డులలో 50 వేల మంది జనాభా ఉన్నారు. భుజబలరాయుడు మంచినీటి చెరువు, భుజబలరాయుడు స్టోరేజ్ ట్యాంకుకు సంబంధించి ఐదు ఫిల్టర్ బెడ్‌లున్నాయి. వీటి ద్వారా ఎనిమిది వార్డుల్లోని 13 వేల మందికి నీటిని సరఫరా చేస్తారు. ఆకివీడు పంచాయతీ ఏర్పడిన తర్వాత ఈ మంచినీటి చెరువుల దగ్గర ఐదు స్క్వేర్ ఫిల్టర్ బెడ్‌లు నిర్మిస్తే వాటిలో రెండు శిథిలమయ్యాయి. కొన్నాళ్ల తర్వాత రెండు కొత్త ఫిల్టర్ బెడ్‌లు నిర్మించారు. మూడు స్క్వేర్ ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక మార్చి 18 ఏళ్లు పైబడింది. రెండు రౌండు ఫిల్టర్ బెడ్‌లలో 20 నెలలు కావస్తోంది. ఇసుక మార్చకపోవడంతో నీరు పేడ రంగులోకి మారడమే కాకుండా దుర్వాసన వస్తోంది. ఒక్కో ఫిల్టర్ బెడ్‌లో ఇసుక మార్చడానికి రూ.6 లక్షలకుపైగా ఖర్చవుతోంది. పట్టణం మొత్తం మంచినీటి సరఫరాకు 60 ఏళ్ల క్రితం సిమెంట్ పైపులు వేశారు. అవి తుప్పుపట్టి పగిలిపోవడంతో నీరు కలుషితం అవుతోంది.

- గాలిబ్ మంచినీటి చెరువుకు సంబంధించి 1, 2, 15, 16, 17, 18, 19, 20 వార్డులకు ఒక ఫిల్టర్ బెడ్ ఉంది. మరొకటి నిర్మించాలి. ఇక్కడ 15 వేల మంది జనాభా ఉన్నారు.
- ఆనాల మంచినీటి చెరువుకు వెలంపేటలో ఒక ఫిల్టర్ బెడ్ ఉంది. అక్కడ మరొకటి నిర్మించాలి. 10 నుంచి 16 వార్డులలో 16 వేల మంది జనాభా ఉన్నారు. రు.
- ధర్మాపురం అగ్రహారంలో మంచినీటి చెరువుకు ఫిల్టర్ బెడ్ ఉంది. అక్కడ 17వ వార్డులో 6 వేల మంది జనాభా ఉన్నారు. ఆకివీడులో రోజుకు 3.98 మిలియన్ లీటర్ల మంచినీటిని సరఫరా చేస్తున్నారు.



ఫిల్టర్ బెడ్‌లో నాచుపట్టి రంగు మారిన నీరు


కొత్తగా నిర్మించిన విజిటర్ బ్లాక్

భీమవరం రైల్వేస్టేషన్‌కు కొత్త కళ

రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్‌లో ఎంతో పేరుపొందిన భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ టాప్-5లో ఉంది. కొంత కాలం క్రితం కేంద్ర ప్రభుత్వం అమృత్ రైల్వేస్టేషన్ పనుల్లో భాగంగా భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ. 40 కోట్లను మంజూరు చేశారు. దీంతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రైల్వే స్టేషన్ ముఖద్వారాన్ని మొత్తం మార్పు చేస్తున్నారు. 12 మీటర్ల వెడల్పుతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ప్లాట్‌ఫామ్ నంబర్ 1పై మొత్తం ఫ్లోరింగ్‌ను గ్రానైట్ రాళ్ళతో మారుస్తున్నారు. దాంతోపాటు దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేసి బయటి నుంచి టిక్కెట్ కౌంటర్ వరకు, టిక్కెట్ కౌంటర్ నుంచి ప్లాట్‌ఫాం వరకు వీల్ చూర్లు వెళ్ళే విధంగా మారుస్తున్నారు. ప్లాట్‌ఫామ్ నెంబర్ 1పై కొత్తగా ఏసీ వెయిటింగ్ హాల్ నిర్మిస్తున్నారు. ప్లాట్‌ఫామ్ నెంబర్-2పై మోడ్రన్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ముఖద్వారం వద్ద ఉన్న ఆటోలు, కార్లు పార్కింగ్‌ను కొంత దూరంలో పెట్టే విధంగా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోజూ వేలల్లో ప్రయాణికులు

టౌన్ రైల్వేస్టేషన్‌కు రోజుకు సుమారు 10 వేల నుంచి 15 వేల మంది వరకు ప్రయాణికులు ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. నెలకు టౌన్ రైల్వే స్టేషన్ ఆదాయం సుమారు కోటి రూపాయల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అలాగే జంక్షన్ రైల్వే స్టేషన్‌లో కూడా నెలకు రూ. 50 లక్షల వరకు ఆదాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ఉండి రోడ్డు నుంచి టౌన్ రైల్వే స్టేషన్‌కు వెళ్ళే రహదారిలో ఇరువైపులా వాహనాల పార్కింగ్ వల్ల స్టేషన్‌కు వెళ్ళే ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే శాఖలో ఉండటంతో రైల్వే పోలీసులు కనీసం అటు వైపు చూడకపోవడంతో రద్దీగా ఉన్న సమయంలో వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్ రద్దీని రైల్వే పోలీసులు క్రమబద్ధీకరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నూతనంగా నిర్మించిన భవనం.. ప్లాట్‌ఫాంపై పనులు చేస్తున్న దృశ్యం



లంకపాకల కొండరెడ్డి గ్రామంలో పురివిప్పి నాట్యమాడుతున్న నెమలి

నాట్య మయూరం..

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అనుకోని అతిథి ఇంటి కొస్తే కుటుంబ సభ్యులు ఎంతగా ఆనందిస్తారో తెలియనిది కాదు. మంగళవారం ఉదయం ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని అంకపాకల కొండరెడ్డి గ్రామంలో నెమలి ప్రత్యక్షమైంది. నెమలిని చూసిన గ్రామస్తులంతా మంత్ర ముగ్ధులయ్యారు. మంగళవారం తెల్లవారుతుండగా మగ నెమలి గ్రామంలో ప్రత్యక్షమై నాట్యం చేయడంతో గ్రామస్థులంతా ఆనందంతో పరవశించిపోయారు. చిన్ననాటి నుంచీ ఏదో ఒక సందర్భంలో నెమలి తమ గ్రామానికి వచ్చి వెళ్లడం చూస్తున్నానని గ్రామస్థుడు కారం రాఘవ పేర్కొన్నారు. ఉదయం వచ్చిన నెమలి సాయంత్రం వరకు గ్రామంలోనే ఉంది. నెమలి తమ గ్రామానికి వచ్చి వెళ్ళడం అదృష్టంగా భావిస్తున్నామని, ఒక్కోసారి ఆడ నెమలితో కలిసి వస్తుందని తెలిపారు.



పాలకోడేరులో ఉత్తర దిశగా ప్రయాణం చేసే గోస్తనీ నది .. వేంకటేశ్వరస్వామి ఆలయం

పుణ్య నదికి ఏమి గతి ?

మురికికూపంగా గోస్తనీ నది

7 నుంచి తీర్థోత్సవాలు

పాలకోడేరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఎంతో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం.. అక్కడి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తే జీవితం ధన్యమవుతుందని భావిస్తూ ఉండేవారు. కాశీ తర్వాత మరో కాశీగా పిలిచేవారు. పరమ పవిత్ర క్షేత్రంగా విరాజిల్లిన ఈ ప్రదేశం నేడు ముక్కు మూసుకునే పరిస్థితికి వచ్చింది.కాశీలోనే ఉత్తర దిశగా ప్రయాణం చేసే నది ఉంటుంది. పాలకోడేరు గ్రామంలోని ఉత్తర దిశగా ప్రయాణం చేసే గోస్తనీ నదిని పవిత్ర పుణ్యక్షేత్రంగా భావించి పుణ్యస్నానాలు ఆచరించేవారు. మహాత్మాగాంధీ చితాభస్మాన్ని ఈ నదిలోనే కలిపారంటే ఎంత పవిత్రమైందో అర్థమవుతుంది. నేడు అంత పవిత్రమైన పుణ్యనది మురికికూపంగా తయారైంది. మోగల్లు గ్రామా నికి మూడువైపులా ఈ నది ప్రవహిస్తుంటుంది. ఉత్తరముగా ప్రవహించిన చోటనే మోద్గల్య మహర్షి తపస్సు చేయడంతో మోద్గల్యపురమని పిలిచేవారు. కాలక్రమేణా అది మోగల్లుగా మారింది.

మూడు రోజుల పాటు ఉత్సవాలు

గోస్తనీ నది తీర్థోత్సవం అంటే ఒకప్పుడు జిల్లాలోనే మంచిపేరు. కాశీ వెళ్ళలేనివారంతా మరో దక్షిణ కాశీగా భావించి ఈ గోస్తనీ నదిలోనే పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకునేవారు. ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు 94వ తీర్థోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. 7వ తేదీన రామాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, రాత్రి కూచిపూడి నృత్యాలు ఉంటాయి. 8వ తేదీన కోదండరామ, వెంకటేశ్వర స్వామి కల్యాణం, అన్నసమారాధన ఉంటాయన్నారు.

పూర్వ వైభవాన్ని నిలబెట్టాలి



ఒకప్పుడు పుణ్యక్షేత్రంగా భావించే గోస్తనీ నది నేడు మురికి కూపంలా తయారైంది. ఆ నదికి పూర్వవైభవం వచ్చినప్పుడే ఈ ప్రాంతానికి పూర్వవైభవం వస్తుంది.

-గాదిరాజు బాబు, పాలకోడేరు



భీమవరం మావుళ్లమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం బాలనాగమ్మ నాటకం ప్రదర్శించారు..ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో విచ్చేసి వీక్షించారు..

ఈజీ మనీ కోసం నేడు యువత వెంపర్లాడుతున్నారు. కాలు కదపకుండా డబ్బు సంపాదించడానికి తహతహలాడుతున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలవుతూ లక్షల్లో సొమ్ములు పోగొట్టుకొని అప్పులు పాలవుతున్నారు. నేడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోంది.. ఇంటర్‌నెట్ కూడా ఇంట్లోకి వచ్చింది.. కాలేజీ విద్యార్థులు, చిరు ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఎక్కువగా ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆకర్షితులై వ్యసనాల బారినపడుతున్నారు. అప్పులపాలై తీర్చేదారిలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు

-నిడమర్రు (ఆంధ్రజ్యోతి)



మాయా జూదం

ఆకర్షిస్తున్న ఆన్‌లైన్ గేమ్స్

బానిసలవుతున్న యువత, చిరు వ్యాపారులు

రోజంతా స్మార్ట్ ఫోన్లతో కాలక్షేపం

ఈజీ మనీ కోసం ఆరాటం

లక్షలు పోగొట్టుకొని అప్పులపాలు

అవి తీర్చలేక ఆత్మహత్యలు

భీమవరం పరిసర ప్రాంతానికి చెందిన ఓ ప్రముఖ పూజా సామగ్రి షాపు నిత్యం వ్యాపారం పచ్చతోరణంగా ఉంటుంది. రోజూ షాపు కౌంటర్ 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు అమ్మకాలు సాగిస్తుంటారు. స్నేహితుల ప్రభావంతో ఆ షాపు యజమాని కుమారుడికి ఆన్‌లైన్ గేమింగ్ అలవాటైంది. ఇటీవల కాలంలో తన తండ్రి వ్యాపార నిమిత్తం బ్యాంకులో జమ వేయమని చెప్పిన సొమ్ము 10 లక్షల రూపాయలు ఆన్‌లైన్ గేమింగ్‌లో పెట్టడంతో ఆ సొమ్ము మొత్తం గల్లంతైంది. ఈ విషయంలో తండ్రీకొడుకుల మధ్య గొడవలు మొదలవ్వడంతో చివరకు కుమారుడు ఆత్మహత్య చేసుకొన్నాడు.

నిడమర్రు గ్రామానికి చెందిన ఓ ఆక్వా రైతు కొడుకు ఓ రోజు ఇంటి నుంచి ఎవరికీ చెప్పపెట్టకుండా విజయవాడ వెళ్లిపోయాడు. మూడు రోజులపాటు అందరినీ విచారించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. చివరికి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేయగా ఆ కుర్రాడు విజయవాడలో ఉన్నట్లు ఇన్‌స్టాగ్రాం అకౌంట్ ద్వారా తేలింది. సంగతేంటని మెల్లగా ఆరా తీయగా ఆన్‌లైన్ గేమ్‌లలో చాలా డబ్బు పోగొట్టానని, దాని కోసం 6 లక్షల వరకు అప్పులు చేయాల్సి వచ్చిందని బోరున విలపించాడు. పోలీసులు, తల్లిదండ్రులు ఆ కుర్రాడికి నచ్చచెప్పి ఇంటికి తీసుకొచ్చారు.

గేమ్‌లోకి వచ్చేలా ఎర వేస్తారు

రమ్మీ, విన్‌జో, ఎంపిఎల్, లూడో ఎంపైర్, జూపీ, జంగిల్ రమ్మీ, డ్రీమ్ 11, గేమీ,ర గెట్ మెగా, ఎ23, అడ్డా 52, గేమీజీ, క్యాడో, వీల్ ఆఫ్ పాంక్యూన్, రమ్మీ కల్చర్ వంటి ఆన్‌లైన్ గేమ్‌లు యువతను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఒక్కసారి ఆ గేమ్‌ల జోలికి వెళ్లామా తిరిగి వెనక్కి వచ్చే పరిస్థితి ఉండదు. కొత్త ఖాతాదారులకు ఆదిలో కొంత డబ్బులు ఎరజూపి ఆ తర్వాత వారి ప్రతాపం చూపెడుతున్నారు. ముందు వేలల్లో లాభం చూపించి తర్వాత యువత నుంచి లక్షల్లో కొల్లగొడుతున్నారు. స్మార్ట్ ఫోన్‌లో నెట్ ఆన్ చేస్తే చాలు ప్రకటనలతో చిరువ్యాపారులను కూడా దారి మళ్లిస్తున్నారు. పండ్ల వర్తకందారులు, చెప్పుల షాపువాళ్లు, బట్టల దుకాణాల్లో పనివాళ్ళు, సెలూన్ షాపులో కుర్రాళ్లు, ఇంటర్ నెట్ సెంటర్ నిర్వాహకులు సైతం ఈ ఆన్‌లైన్ గేమ్‌ల ఉచ్చులో పడి లక్షలు పోగొట్టుకొంటున్నారు.



చేతిలో ఫోన్ ఉంటే చాలు..

ఆన్‌లైన్‌గేమ్ అన్నింటిలోనూ ప్రధానమైనమైనది రమ్మీ గేమ్ (పేకాట). పూర్వం పేకాట ఆడాలంటే ఊరిలో కుర్రాళ్ళు గానీ, పెద్దలు గానీ చాటుమాటుగా ఊరికి దూరంగా పోయి ఆడుకొనేవారు. నేడు ఆన్‌లైన్ గేమ్‌ల పుణ్యమా అని నట్టింట్లోనే స్మార్ట్ ఫోన్‌లో ఆడేస్తున్నారు. తల్లిదండ్రుల కళ్లు కప్పి రమ్మీ గేమ్‌లు ఆడుకొంటూ బంగారం లాంటి భవిష్యత్తును అంధకారం చేసుకొంటున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లకు మూలం స్మార్ట్‌ఫోన్‌లే. నేడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోంది. మంచికి వాడుతున్నారో, చెడు వ్యసనాలకు వాడుతున్నారో తల్లిదండ్రులు తెలుసుకోవాలి

బానిసలవుతున్న చిరు వ్యాపారులు

ఆన్‌లైన్ గేమింగ్‌లకు చిరువ్యాపారులు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. చదువు పూర్తయినా ఉద్యోగం దొరక్క పోవడంతో ఎక్కడో అప్పుతెచ్చి తల్లిదండ్రులు తమ పిల్లల చేత జ్యూస్ సెంటర్, ఇంటర్‌నెట్ సెంటర్, పాలవ్యాపారం, కిరణా, రేడీమేట్ వస్త్ర దుకాణం వంటి వ్యాపారాలు పెట్టిస్తున్నారు. కరోనా కాలం నుంచి వ్యాపారాలు సరిగా లేకపోవడంతో షాపులో కూర్చొన్న యువత ఆన్‌లైన్ గేమింగ్‌లకు అలవాటు పడ్డారు. మొదట్లో సరదాగా అంటూ దిగిన కుర్రాళ్ళు తర్వాత బానిసలవుతున్నారు. ఉదయం షాపులు తీసిన మొదలు ఈ రోజు ఏ గేమ్‌లో ఎంత సంపాదించావు..? ఎంత పోయింది అన్న చర్చలే వీరి మధ్య ప్రధాన సంభాషణ జరుగుతుంది.

ఈజీ మనీ కోసం ఆరాటం

క్షణాల్లో లక్షాధికారులై పోవాలనే దురాశతో చాలామంది తమ జీవితాలను చిన్నాభిన్నం చేసుకొంటున్నారు. ఈజీ మనీ కోసం ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ డబ్బు పోగొట్టుకొంటున్నారు. యువత ఈ మాయాజాలం ఉచ్చులో పడి గిలగిల్లాడుతున్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువత, చిరువ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఈ మాయలో పడి అప్పులు పాలవుతున్నారంటే ఆశ్చర్యం వేస్తుంది. బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టడం, బైక్‌లు, ఖరీదైన సెల్‌ఫోన్‌లు కూడా తాకట్టుపెట్టి జూదం ఆడుతున్నారు. కుటుంబ సభ్యులకు అబద్ధాలు చెప్పి మరీ డబ్బులు గుంజుకొని జూదం ఆడుతున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లపై అవగాహన లేకపోవడంతో వయసుతో సంబంధం లేకుండా అందరూ డబ్బులు పోగొట్టుకొంటున్నారు.

అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు

లక్షల్లో అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి సొమ్ములు పోగొట్టుకొంటున్న వారు అప్పుల ద్వారా జీవితాన్ని కుటుంబాన్ని నెట్టు కొస్తున్నారు. స్థాయికి మించి అప్పులు చేసి తీర్చే మార్గం లేక ఊరు విడిచి పారిపోవడమో, ఆత్మహత్యలు చేసుకోవడం వంటి సంఘ టనలు నేడు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ జరుగుతున్నాయి.

• పెద్దవాళ్లు గమనిస్తూ ఉండాలి



నేడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటోంది. ఇంటర్‌నెట్ సదుపాయం ద్వారా విద్యార్థులు చెడు వ్యవసనాల పట్ల ఆకర్షిలవుతున్నారు. ఆన్‌లైన్‌లో జూదాల్లో లక్షల్లో సొమ్ములు పోగొట్టుకొం టున్నారు. ముఖ్యంగా చదువుకొనే విద్యార్థులు తమ స్మార్ట్ ఫోన్ సక్రమంగా ఉపయోగించుకోవాలి. ఇళ్లల్లో పెద్దలు కూడా తమ పిల్లల భవిష్యత్తు దృష్ట్యా వారి అలవాట్లను గమనిస్తూ వారిని సరైన బాటలో వెళ్లేలా చూసుకోవాలి.

- కాళ్లకూరి సత్యనారాయణమూర్తి, రిటైర్డు ప్రిన్స్‌పాల్, లయన్స్‌క్లబ్ పూర్వ అధ్యక్షుడు, గణపవరం

• విలువైన కాలం, జీవితం నాశనం



ఇటీవల కాలంలో యువత ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల ఆకర్షితులై దానికి బానిసలవుతున్నారు. సెల్‌ఫోన్‌లో ఇంటర్‌నెట్ ద్వారా విలువైన విజ్ఞానం పొందవచ్చు.కొంత మంది యువకులు, చిరు వ్యాపారులు,ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలవుతున్నారు. తమ విలువైన కాలాన్ని, జీవితాలను నాశనం చేసుకొంటున్నారు.సరదాగా ఆడుతున్న జూదం తర్వాత వ్యవసంగా మారుతోంది. తల్లిదండ్రులు కూడా దృష్టి పెట్టాలి.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.


- ఎంవీ సుభాష్ సీఐ, నిడమర్రు



సూర్యప్రభ వాహనంపై సర్వాంతర్యామి

రథసప్తమి వేళ ఊరేగిన శ్రీవారు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సప్త అశ్వాలను అధిరోహించి సూర్యప్రభ వాహనంపై ఉభయ దేవేరులతో కొలువుతీరిన చినవెంకన్న క్షేత్ర పురవీధుల్లో విహరించారు. సాయం సమయంలో చంద్రప్రభపై తిరు వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రథసప్తమి పురస్కరించుకుని మంగళవారం ఉదయం, రాత్రి వేశల్లో జరిగిన ఈ వాహనసేవలు భక్తజనులకు నేత్ర పర్వమయ్యాయి. ఉదయం సూర్య ప్రభవాహనం, సాయంత్రం చంద్ర ప్రభపై స్వామి, అమ్మవార్లను ఉంచి విశేష పూజలు జరిపి హారతులు సమర్పించారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామ స్మరణలు, మేళతాళాల నడుమ శ్రీవారు తిరువీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు హారతులు పట్టారు.



గాలాయగూడెంలో శివుడిపై సూర్య కిరణాలు

దెందులూరు ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) దెందులూరు మండలం గాలాయగూడెం శివాలయంలో అద్భుతం జరిగింది. మంగళవారం ఉదయం 6.30 సమ యంలో భీమ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో శివ లింగంపై సూర్యకిరణాలు ప్రసరించాయి. గ్రామస్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. 30 సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే ఇలా జరుగుతుందిని గ్రామస్థులు చెబుతున్నారు.

ముస్తాబైన అంతర్వేది లక్ష్మీనరసింహుడు

వైభవంగా ప్రారంభమైన కల్యాణోత్సవాలు

పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెగా స్వామి, అమ్మవార్లకు అలంకరణ

అంతర్వేది, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు రథసప్తమి రోజున వైభవంగా ప్రారంభమయ్యాయి. వార్షికంగా బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు తొలి పూజలు చేశారు. ఆలయ స్థానాచార్యుడు వింజమూరి రామరంగాచార్యులు సమక్షంలో ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాసారాచార్యులు ఆధ్వర్యంలో శ్రీవారికి వైష్ణవ సంప్రదాయం ప్రకారం పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనం తరం శ్రీస్వామి వారి రథానికి పూజలు చేశారు. గంటలు మోగగా భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని లాగి ఉత్సవాలను ప్రారంభించారు. పల్లిపాలెం గ్రామానికి చెందిన వాహనకారులు, గ్రామస్తులు, భక్తులు రథాన్ని మెరక వీధి (రాజా వారి వీధి)కి చేర్చారు. సాయంత్రం లక్ష్మీనరసింహస్వామివారిని పెండ్లి కొడుకుగాను, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను అలంక రించారు. అర్చకుల వేద మంత్రోచ్చరణల నడుమ నీలమేఘశ్యాముడైన స్వామివారికి బుగ్గన చుక్క పెట్టడంతో పెండ్లి కొడుకుగా దర్శనమిచ్చారు. వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి-అమ్మవార్లకు బెల్లంకొండ, ఉండపల్లి కుటుంబీకులు ఉంగరాలను సమర్పించారు. ఉభయ కుటుంబాలకు చెందిన ఆడపడుచులు స్వామి, అమ్మవార్లకు హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, ఆలయ ఫ్యామిలీ ఫౌండర్, చైర్మన్ రాజా కలిదిండి కుమార రామ గోపాలరాజా బహదూర్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

సూర్య, చంద్ర ప్రభ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం

కల్యాణోత్సవాల్లో తొలిరోజైన మంగళవారం ఉదయం లక్ష్మీనరసింహుడు సూర్య వాహనంపై పురవీధుల్లో విహరించగా భక్తులు హారతులు పట్టారు. రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది.


రాజావారి వీధికి రథాన్ని తీసుకువస్తున్న భక్తులు

అంతర్వేదికి 35 బస్సులు

భీమవరం టౌన్,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణాన్ని పురస్కరించుకుని ఈ నెల 7, 8 తేదీల్లో జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 35 సర్వీసులను నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా భీమవరం డిపో నుంచి 15 సర్వీసులు, నరసాపురం నుంచి 10, తణుకు నుంచి 5, తాడేపల్లిగూడెం నుంచి 5 సర్వీసులను నడపాలని నిర్ణయించారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు అందాయి. ప్రతి డిపోలోను 7వ తేదీ ఉదయం నుంచి బస్సులను నడిపే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. భీమవరం బస్సు కాంప్లెక్స్ నుంచి ఉదయం 8.30 గంటల నుంచి ప్రతి అరగంటకు ఒక బస్సు చొప్పున నడపనున్నారు. మలికిపురం వరకు మాత్రమే ఈ సర్వీసులు నడుస్తాయి. అక్కడి నుంచి అంతర్వేది వెళ్ళేందుకు రాజోలు డిపో ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసుల ద్వారా పంపనున్నారు.

భక్తుల సముద్ర స్నానాలు

రథ సప్తమిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాకార మండపంలో ఉదయం అధిక సంఖ్యలో మహిళలు సూర్యనమస్కారాలు చేశారు. క్యూలైన్లలో భక్తులకు ఉత్సవ సేవకులు, పోలీసులు సేవలు అందించారు.

పాలన ఎలా ఉంది?



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- టీడీపీ ఇన్‌చార్జిల తీరుపై ఐవీఆర్‌లో అధిష్ఠానం ఆరా
- తెలుగుదేశం శ్రేణుల ఆసక్తి

తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిల పనితీరు, పాలనపై అధిష్ఠానం ఆరా తీస్తోంది. కూటమి భాగస్వామ్య పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట టీడీపీ ఇన్‌చార్జిలు ఉన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 15 నియోజకవర్గాలను గడచిన ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి కైవసం చేసుకుంది. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, ఉంగుటూరు, పోలవరం, నిడదవోలు నియోజకవర్గాల్లో కూటమి తరపున జనసేన ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆరు చోట్ల తెలుగుదేశం పార్టీకి ఇన్‌చార్జ్‌లు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీ కేడర్‌ను కాపాడుకోవాలంటూ ఎప్పటికప్పుడు అధిష్ఠానం దిశానిర్దేశం చేస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావడంతో పాలన, ఇన్‌చార్జిల పనితీరుపై అధిష్ఠానం దృష్టి పెట్టింది. ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజల స్పందన తెలుసుకుంటోంది. తెలుగుదేశం కేడర్‌తోపాటు అన్ని వర్గాల ప్రజలకు ఐవీఆర్ కాల్స్ వచ్చాయి. ఇన్‌చార్జ్‌ల పాలన ఎల ఉందని ప్రశ్నించి బాగాలేదు, పరవాలేదు, బాగుంది అంటూ 3 ఆప్షన్‌లు ఇచ్చారు. ఒక ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలని సూచించారు, ఇటీవల ఎమ్మెల్యేల పనితీరు పైనా కూటమి ప్రభుత్వం ఆరా తీసింది. తాజాగా ఇన్‌చార్జ్‌ల పనితీరుపై దృష్టి పెట్టింది.

ఇంటెలిజెన్స్ నివేదికలు

ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల పనితీరుపై ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ విభాగం వివరాలు చేరవేస్తోంది. తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం కూడా నియోజకవర్గాల్లో పరిస్థితులపై దృష్టి పెట్టింది. ఇటీవల జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో సెటిలెమెంట్‌లు అధికంగా ఉంటున్నాయి. వాటిలో ముఖ్యపాత్ర పోషిస్తున్న వారిపై అధిష్ఠానం వద్ద నివేదికలున్నాయి. నియోజకవర్గాల్లోనూ ఈ దందాపై చర్చ సాగుతోంది. వారి ప్రభావం ఎమ్మెల్యేల పనితీరుపైనా ప్రభావం చూపుతోంది. అధిష్ఠానం వద్ద నెగటివ్ మార్కులు పడుతున్నాయని నియోజకవర్గ కేడర్‌లో చర్చ జరుగుతోంది. ఐవీఆర్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి కూడా అదే రకమైన స్పందన వస్తోందని పార్టీ కార్యాలయాల నుంచి సంకేతాలు వస్తున్నాయి. మొత్తంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేల పనితీరును అధిష్ఠానం నిశితంగా గమనిస్తోంది.

ఎమ్మెల్సీ ఎన్నిక రెండో రోజు రెండో నామినేషన్



కలెక్టర్ వెట్రిసెల్వికి నామినేషన్ సమర్పిస్తున్న శ్రీనివాస్

ఏలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండో రోజు మంగళవారం రెండో నామినేషన్ దాఖలైంది. ఏలూరుకు చెందిన ములకల శ్రీనివాస్ నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వికి సమర్పించారు. ఒక సెట్ నామినేషన్ సమర్పించిన శ్రీనివాస్‌తో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. కలెక్టర్ వెంట ఏఆర్‌వో, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు ఉన్నారు. తొలిరోజు కాకినాడకు చెందిన పేపకాయల రాజేంద్ర నామినేషన్ దాఖలు చేశారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) గ్రాడ్యుయేటు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిపై కలెక్టర్ నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి జిల్లాలో అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించకుంటే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. రాజకీయ పార్టీలు, నేతల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గోడ రాతలను తొలగించాలన్నారు. బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహణ, లౌడ్ స్పీకర్లకు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, సచివాలయాల అధికారి వైదోసిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

పోలవరం నిర్వాసితుల సమస్యలపై నేడు గ్రామసభ

కుక్కునూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలపై కుక్కునూరులో బుధవారం గ్రామసభ నిర్వహించనున్నారు. ఐటీడీఏ పీఓ రాములు నాయక్ హాజరు కానున్నారు. అన్ని ఆధారాలు ఉన్నప్పటికి చాలా మంది నిర్వాసితుల పేర్లు పునరావాస పరిహారం జాబితాలో లేవు. 18 ఏళ్లు నిండిన వారికి పునరావాస పరిహారం కట్ ఆఫ్ డేట్‌కు ముందే ఉన్న యువతల పేర్లు కూడా జాబితాలో గల్లంతయ్యాయి. తమకు న్యాయం చేయాలంటూ నిర్వాసితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో జరిగే గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ క్రమంలో నిర్వాసితుల సమస్యలపై గ్రామసభ నిర్వహించనున్నారు.

ఖైదీలకు సౌకర్యాలపై ఆరా

జిల్లా జైలును సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి



జిల్లా జైలులో ఖైదీల ఆహార పదార్థాలను రుచి చూస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఏలూరులోని జిల్లా కారాగారాన్ని మంగళవారం సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార, వైద్య, మంచినీరు, పరిశుభ్రత తదితర వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో మాట్లాడుతూ పోలీసులు అరెస్టు చేసేటప్పుడు దగ్గర బంధువులకు గాని స్నేహితులకు గాని తెలియజేయాలన్నారు. కేసు వివరాలకు సంబంధించిన పత్రాలను సంబంధిత ముద్దాయిలకు అందజేయాలని, ఇది ఖైదీల హక్కు అన్నారు. లేని పక్షంలో సంబంధిత మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు. అలాగే అవసరమైన ఖైదీలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి, న్యాయ సహాయం అందిస్తుందని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట కారాగారం సూపరింటెండెంట్ సీహెచ్‌ఆర్ వి స్వామి, జైలర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ కోడిపై వైరస్ దాడి





పౌల్ట్రీ పరిశ్రమపై వైరస్ దాడి చేసింది. వైరస్ కారణంగా లక్షల్లో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. గత డిసెంబరులో వైరస్ వ్యాప్తితో కోళ్లు చనిపోతునే ఉన్నాయి. మరింత విజృంభించడంతో పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 30 లక్షల నుంచి 40 లక్షల కోళ్లు మృత్యువాత పడినట్లు అంచనా. మరోవైపు గుడ్ల ఉత్పత్తి భారీగా తగ్గిపోయి పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు.

- అంతుచిక్కని వైరస్
- లక్షల్లో కోళ్లు మృతి
- గుడ్ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం
- సంక్షోభంలో పౌల్ట్రీ పరిశ్రమ

తణుకు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైరస్ దాడితో లక్షల్లో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీనితో గుడ్ల ఉత్పత్తి కూడా తగ్గి పౌల్ట్రీ పరిశ్రమ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. పౌల్ట్రీ పరిశ్రమపై చలికాలంలో వైరస్ ప్రభావం ఎక్కువ. ప్రస్తుతం ఆర్‌డి వైరస్ కొత్త వేరియంట్‌తో అధిక సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయని భావిస్తున్నారు. ఈనెలాఖరు వరకు వైరస్ ప్రభావం ఉంటుందని, వేసవి రాకతోనే వైరస్ తగ్గుముఖం పడుతుందని పలువురు రైతులు చెబుతున్నారు. ఏటా క్రమం తప్పకుండా పౌల్ట్రీ కోళ్లకు వాక్సిన్ వేయిస్తే వైరస్ ప్రభావం తక్కువగా ఉంటుందని సమాచారం.

తగ్గిన గుడ్ల ఉత్పత్తి

పౌల్ట్రీ పరిశ్రమపై వైరస్ దాడితో లక్షలో కోళ్లు మృత్యువాత పడడంతో అదే స్థాయిలో గుడ్ల ఉత్పత్తి పడిపోయింది. ఉమ్మడి జిల్లాలోని పౌల్ట్రీల్లో 1.7 కోట్ల కోళ్లు ఉంటే రోజుకు 1.1 కోట్ల గుడ్లు ఉత్పత్తి అయిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 80 లక్షల నుంచి 90 లక్షల గుడ్లు వస్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గిపోయాయి. గతంలో బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలకు 30 లారీల గుడ్లు ఎగుమతి అయ్యేవి. ప్రస్తుతం 12 నుంచి 15 లారీలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి.

ఆర్థికంగా తీవ్ర నష్టం

వైరస్ వ్యాప్తితో పౌల్ట్రీ పరిశ్రమకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. 2006లో బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అప్పటి నష్టాలతో చాలా మంది పరిశ్రమ నుంచి ఇతర రంగాల వైపు వెళ్లిపోయారు. ప్రస్తుత వైరస్ తాకిడికి తిరిగి అదే పరిస్థితి తలెత్తింది. పెద్ద ఎత్తున కోళ్లు మృత్యువాత పడడం, వైరస్ నిరోధక చర్యలు భారం కావడం, తగ్గిన గుడ్ల ఉత్పత్తితో రైతులు నష్టపోతున్నారు.

సంరక్షణ ఇలా..

- వైరస్ దాడితో మృత్యువాత పడిన కోళ్లను బహిరంగ ప్రాంతాల్లో వదిలేస్తే వైరస్ మరింత ఉధృతమయ్యే అవకాశాలున్నాయి.
- అధిక సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడితే గొయ్యి తీసి పాతిపెట్టాలి.
- ఫారమ్ కోళ్లకు వైరస్ నిరోధ వాక్సిన్ వేస్తుంటారు. నాటుకోళ్లకు వాక్సిన్ వేస్తే వైరస్ వ్యాప్తి తగ్గుతుంది.
- పౌల్ట్రీలకు మెస్ ఫినిషింగ్ ఉంటే వైరస్ వ్యాప్తి తక్కువగా ఉంటుంది.
- జీవ సంరక్షణ విధానాలతో ఫారమ్‌లకు మేలు జరిగే అవకాశాలు ఉంటాయి.
- బలవర్థక ఆహారం అందించే ఫారమ్‌లో వైరస్ ఉధృతి తక్కువ.

వైరస్ నిర్ధారణకు నమూనాల సేకరణ

పశుసంవర్థక శాఖ జేడీ మురళీకృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ మురళీకృష్ణ

వైరస్ దాడితో మృత్యువాత పడిన నమూనాలు సేకరించి విజయవాడ ల్యాబ్ పంపించినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ మురళీకృష్ణ తెలిపారు. తణుకులోని నెక్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోళ్ల ఫారలలో జీవ సంరక్షణ చర్యల ద్వారా వ్యాధులను అదుపు చేయవచ్చన్నారు. 15 రోజుల నుంచి దేశవాళీ కోళ్లు, పౌల్ట్రీ కోళ్లలో అసహజ మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. కోళ్లలో వ్యాధి నిరోధక శక్తి క్షీణించడంతో మిక్స్‌డ్ వైరస్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని వివరించారు. అధిక సంఖ్యలో మృత్యువాత పడడంపై కారణాలు పరీక్షల తర్వాత తెలుస్తాయన్నారు. రైతులు వ్యాధి నివారణకు బయో సెక్యూరిటీ విధానాలు పాటించాలన్నారు. చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో గొయ్యి తీసి పూడ్చాలన్నారు. రోడ్డు పక్కన, కాలువలో పడవేయరాదన్నారు. కోళ్లకు వ్యాక్సినేషన్ క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. క్రిమిసంహారక మందులు, తాగునీటిలో వ్యాధి నిరోధక మందులు వాడడం వల్ల వ్యాధి అదుపులోకి వస్తుందన్నారు. వైరస్ మనుషులకు సోకే అవకాశం లేదన్నారు. గుడ్లు, మాంసం వినియోగించవచ్చని చెప్పారు. ఫారమ్‌లో కొంగలు, పక్షులు నివారణకు మెస్‌లు, గోడలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జేడీతో పాటు డిప్యూటీ డైరెక్టర్లు ఎల్‌కే.సుధాకర్, వాకాణి ప్రసాద్, ఏడీలు అత్తిలి నరసింహారావు, శంకర్, పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులు కొమాట్లపల్లి వెంకట సుబ్బారావు, గుడితి గంగాధరరావు, పెనుమర్తి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ రైతుల సమస్యలు పరిష్కరించండి : సీఎంకు వినతి



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తున్న పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, తదితరులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కాల్దరి గ్రామానికి చెందిన కోమట్లపల్లి వెంకట సుబ్బారావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం విజయవాడలో సమస్యలను వివరించారు. సంక్షోభంలో ఉన్న పౌల్ట్రీ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరినట్టు చెప్పారు. జొన్న దిగుమతి సుంకం తగ్గించాలని, బ్యాంకు రుణాలపై వడ్డీ రాయితీ ఇవ్వాలని కోరామన్నారు. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని సుబ్బారావు చెప్పారు. టి.కుటుంబరావు, పడాల సుబ్బారెడ్డి, గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, జి.గంగాధరరావు, పౌల్ట్రీ యజమానులు ఉన్నారు.

నగ్న చిత్రాలు నెట్‌లో పెడతానని బెదిరించి..

రూ.2.52 కోట్లు కొట్టేశాడు!

- బెదిరిపోయిన యువతి
- దఫదఫాలుగా సొమ్ము జమ
- అప్పులపాలైన కుటుంబం
- పోలీసులకు ఫిర్యాదు
- గుంటూరులో మోసగాడిని అరెస్టు చేసిన పోలీసులు
- రూ.1.81 కోట్ల విలువైన ఆస్తులు సీజ్



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుడు సాయికుమార్, స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువతికి పరిచయమైన యువకుడు ఆమెను నగ్న చిత్రాలతో బెదిరించి కోట్లు కొట్టేశాడు. ఈ సంఘటన వివరాలు కొవ్వూరులో డీఎస్పీ జి.దేవకుమార్ మంగళవారం విలేకరులకు వెల్లడించారు. తమిళనాడుకు చెందిన ఒక కుటుంబం 30 ఏళ్ల క్రితం నిడదవోలులో స్థిరపడింది. వారి ఒక్కగానొక్క కుమార్తె బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదువుకుని హైదరాబాద్ విప్రో కంపెనీలో నాన్ ఐటీ ఉద్యోగంలో చేరింది. కూకట్‌పల్లిలోని గాయత్రి ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటుంది. హాస్టల్‌లో చిన్ననాటి స్నేహితురాలు కాజా అనూషాదేవి కలిసింది. అనూషాదేవి గుంటూరు రూరల్ ప్రాంతానికి చెందిన నినావత్ దేవనాయక్ అలియాస్ మధు సాయికుమార్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. భర్త సాయికుమార్‌ను యువతికి పరిచయం చేసింది. ముగ్గురు స్నేహంగా ఉండేవారు. 2021లో బాధిత యువతి ఉద్యోగం మానివేసి నిడదవోలు ఇంటికి వచ్చేసింది. ఆ సమయంలో సాయికుమార్ వేరెవరో ఫోన్ చేసినట్టు ఫోన్‌చేసి హాస్టల్‌లో ఉన్నప్పుడు తీసిన న్యూడ్ వీడియోస్ తన వద్ద ఉన్నాయని, నెట్‌లో పెడతానని బెదిరించి డబ్బు డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని యువతి స్నేహితుడిగా నమ్మిన సాయికుమార్‌కు చెప్పడంతో వేరొకరితో సెటిల్మెంట్ చేసినట్టు నమ్మించాడు. ఆ గొడవలో దెబ్బలు తగిలాయని ఆసుపత్రి బిల్లుకు కొంత డబ్బు కావాలని అడిగి తీసుకున్నాడు. అనంతరం గుంటూరులో బాయ్స్ హాస్టల్ పెట్టి దానిని మేనేజ్‌మెంటు చేస్తున్నట్టు కొంత డబ్బు తీసుకున్నాడు. యువతిని ఉద్యోగం కోసం కెనడా పంపిస్తానని కొంత డబ్బు తీసుకున్నాడు. అవసరం వచ్చినప్పుడల్లా డబ్బులు డిమాండ్ చేసేవాడు. డబ్బు ఇవ్వకపోతే న్యూడ్ వీడియోలు తన వద్ద ఉన్నాయని వాటిని నెట్‌లో పెడతానని బెదిరించేవాడు.

బాధిత యువతి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారూ బెదిరిపోయారు. అమ్మాయి జీవితం పాడవుతుందని వ్యాపారంలో సంపాదించిన డబ్బుతో పాటు, ఇల్లు తాకట్టు పెట్టి, తెలిసిన వారి వద్ద కొంత అప్పు చేసి దఫదఫాలుగా 2021 నుంచి 2025 జనవరి వరకు మొత్తం రూ.2,53,76,000 బ్యాంకు, ఫోన్ పే, గూగుల్ పే ద్వారా సాయికుమార్‌కు పంపారు. ఆమె చెల్లించిన మొత్తానికి ఆధారాలు ఉన్నాయి. ప్రస్తుతం యువతి తల్లిదండ్రులు అద్దె ఇంట్లో ఉంటున్నారు. గత నెలలో మరో రూ.14 లక్షలు డిమాండ్ చేశాడు. అప్పటికే అప్పుల పాలైన వారు సొమ్ము ఇవ్వలేదు. సాయికుమార్‌పై ఈ నెల 1న నిడదవోలు పోలీస్‌స్టేషన్‌లో బాధిత యువతి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ జీఎస్ఆర్‌కే పరమహంస నిందితుడు సాయికుమార్‌పై కేసు నమోదు చేశారు. ఐటీ యాక్టు ఉండడంతో నిడదవోలు సీఐ పీవీజీ. తిలక్ కేసు దర్యాప్తును ప్రారంభించారు. యువతి ఇచ్చిన ఆధారాలతో గుంటూరు జిల్లా చిన్నకాని చేరుకుని ఈ నెల 2న సాయికుమార్‌ని అరెస్టు చేశారు. అతడి వద్ద రూ.75 లక్షల నగదు, 938 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.250 కేజీల వెండి వస్తువులు, కారు, బుల్లెట్, చిన్నకానిలో రూ.40 లక్షలతో కొనుగోలు చేసిన అపార్ట్‌మెంటు పత్రాలను తహసీల్దార్, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.1,81,45,000 ఉంటుందన్నారు. సాయికుమార్‌ను ఈ నెల 3న కోర్టులో హాజరుపరచగా జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ చేపట్టవలసి ఉండడంతో సాయికుమార్‌ని ఐదు రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరామన్నారు. ఈ కేసులో ఎటువంటి వీడియోలు లభ్యం కాలేదని తెలిపారు. వీడియోలు లేకపోయినప్పటికి బెదిరించి, డబ్బులు వసూలు చేసినట్టు చెప్పారు. బాధిత యువతి స్నేహితురాలు కాజా అనూషాదేవి పాత్రపై ఆధారాలు లేవన్నారు.

పనికి వెళ్లిన వ్యక్తి కాల్వలో శవమై తేలాడు

నరసాపురం టౌన్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పనికి వెళ్లిన వ్యక్తి నరసాపురం- నిడదవోలు పంట కాల్వలో మంగళవారం శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పున్నా మి రమేష్(45) సోమవారం ఉదయం పనికి వెళతానని చెప్పి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఎంత సేపటికి రాకపోవడంతో మంగళవారం ఉదయం గాలించారు. శ్రీహరిపేటలోని పెట్రోల్‌బంకు ఎదురుగా కాల్వ వద్ద చెప్పులు కనిపించాయి. అనుమానం వచ్చి కాల్వ వెంబడి గాలించగా మృతదేహం లభ్యమైంది. తల్లి అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయలక్ష్మి తెలిపారు.

ప్రేమించిన వ్యక్తి తిడుతున్నాడని యువతి ఆత్మహత్య

భీమవరం క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన వ్యక్తి తిడుతున్నాడన్న మనస్తాపానికి గురైన యువతి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వన్ టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గునుపూడి గరువుపేటకు చెందిన బత్తిన అనూష (19) డిగ్రీ చదివి ఇంటి వద్దే ఉంటుంది. ఆమె ప్రేమించిన ఎం.సత్యనారాయణ తరచు అనూషను తిడుతున్నాడు. ఈ నెల 3న సాయంత్రం 7.30 గంటల సమయంలో అనూష- సత్యనారాయణ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. అనంతరం అనూష స్నానం చేసి గదిలోకి వెళ్లింది. రాత్రి 8.30 గంటల సమయంలో సత్యనారాయణ అనూష సోదరి కృష్ణవేణికి ఫోన్ చేసి మీ సోదరి చనిపోతానంటుంది చూడమని చెప్పాడు. అనూష గదిలోంచి బయటకు రాకపోవడంతో తలుపులు కొట్టినా తీయలేదు. దీంతో కృష్ణవేణి చుట్టుపక్కలవారిని పిలువగా వారు వచ్చి తలుపు బద్దలుకొట్టారు. అనూష ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. కిందకు దింపి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్టు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. మృతురాలి సోదరి కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిల్డ్రన్స్ హోమ్‌కు బాధిత చిన్నారులు



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్డీవో

ఏలూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారులు రాహుల్, రేణుక ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన వెంటనే ఏలూరులోని చిల్డ్రన్స్ హోమ్‌కు పంపిస్తామని ఆర్డీవో ఎంవి.రమణ తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ పిల్లలు కుటుంబ సభ్యులలో ఎవరి దగ్గర ఉన్నా రక్షణ ఉండదని భావించి ప్రభుత్వ సంరక్షణలో ఉంచుతామన్నారు. పిల్లలకు సహాయం చేయడానికి దాతలు ముందుకు రావడంతో రాహుల్, రేణుక పేరిట యూనియన్ బ్యాంకులో ఖాతా ఓపెన్ చేసినట్లు చెప్పారు. దాతలు 025912010003035, ఐఎఫ్ఎస్‌సి కోడ్ యూబీఐఎన్ 0802590కు విరాళాలు ఇవ్వవచ్చని ఆర్డీవో తెలిపారు. వచ్చిన మొత్తం పిల్లల పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని, వారికి మైనారిటీ తీరిన తర్వాత అందజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో తహసీల్దారు కె.స్లీవజోజి, సీడీపీవో పి.బ్యూలా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టర్‌ను మోసం చేసిన మాజీ మంత్రి ఆళ్ళ నాని సోదరుడు'

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆళ్ళ నాని మంత్రిగా ఉండగా ఆయన సోదరుడు రోడ్ల నిర్మాణం బిల్లులు తీసేసుకుని తనను మోసం చేశారని కాంట్రాక్టర్ వేమూరి రామకృష్ణ ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడిని కలిసి వినతిపత్రం ఇవ్వడంతో జిల్లా ఎస్పీకి సీఎం రిఫర్ చేశారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటిని మంగళవారం కలిసి రామకృష్ణ వివరాలు తెలిపారు. వెంకటాపురం పంచాయతీలో తనను సబ్ కాంట్రాక్టర్‌గా నియమించి రూ.3 కోట్లు పనులు చేయించారన్నారు. తనకు కేవలం రూ.70 లక్షలు ఇచ్చి మిగిలిన సొమ్ము మాజీ మంత్రి సోదరుడిని కాంట్రాక్టర్‌గా నమోదుచేసి అతనికి ఇప్పించారన్నారు. దాదాపు రూ.2.5 కోట్లు కోట్లు నష్టపోయాయనని వాపోయారు. ప్రభుత్వం నుంచి వచ్చిన సొమ్మును తనకు ఇప్పించాలని ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే బడేటి చంటిని కోరారు.

సెల్‌ఫోన్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ఏలూరు, పాలకొల్లులో 12 కేసుల నమోదు



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరామ్‌బాబుకు ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఏలూరు, పాలకొల్లులో సెల్‌ఫోన్ దుకాణాలు తనిఖీ చేశారు. ఏలూరులోని సెల్‌టెక్ మొబైల్ షాపు, హిందుస్థాన్ మొబైల్స్ భారత్ టెలికం మొబైల్స్, పాలకొల్లు పట్టణంలోని పూజా మొబైల్ అండ్ స్పేర్ పార్ట్స్, రాందేవ్ మొబైల్స్, శ్రీ మొబైల్ షాపులను తనిఖీ చేశారు. వస్తువుల తయారీ తేదీ, తయారీ చిరునామా, ఎమ్మార్పీ, వినియోగదారు సేవా ఫోన్ నెంబర్ సమాచారం లేకుండా లైట్లు, స్పీకర్లు, సౌండ్‌బాక్స్‌లు, ఇతర మొబైల్ ఉపకరణాలను గుర్తించారు. ఈ ఆరు మొబైల్ షాపులపై తూనికలు కొలతలు చట్ట ప్రకారం 12 కేసులు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్లు పి.శివరామకృష్ణ, పి ప్రసాద్ కుమార్, విజిలెన్స్ ఎస్ఐ కె సీతారామ్, ఏలూరు తూనికలు కొలతల అధికారి పి ప్రశాంతకుమార్, భీమవరం తూనికలు కొలతల అధికారి టి రాంబాబు, పలువురు పాల్గొన్నారు.

7న క్యాంపస్ ఇంటర్వ్యూలు

పెనుమంట్ర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఈ నెల 7న వ్యవసాయ డిగ్రీ లేదా డిప్లొమా చేసిన వారి కోసం క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు పరిశోధనా సహ సంచాలకులు డా. టి. శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సంస్థ ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని, ఎంపిక అయిన వారు ఉద్యోగ నిర్వహణలో భాగంగా క్షేత్ర స్థాయిలో రైతులకు సేవలందించాల్సి ఉంటుందనీ, ఆసక్తి కల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని, ఇతర సమాచారం కోసం సంస్థ వారిని 83749 34362 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

భీమయ్యకు రాష్ట్రపతి పోలీస్ మెడల్



పెనుమంట్ర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పెనుమంట్ర మండలం నెగ్గిపూడి గ్రామానికి చెందిన నేతల భీమయ్య రాష్ట్రపతి పోలీస్ మెడల్‌కు ఎంపిక అయ్యారు. ఈయన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సులో లన్స్ నాయక్ హోదాలో 39 సంవత్సరాలుగా దేశానికి సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా బిఎస్ఎఫ్ సౌత్ బెంగాల్ ఫ్రాంటియర్ ఆధ్వర్యంలో కోల్‌కతాలోని న్యూటౌన్‌లోని ఐటి రీసెర్చ్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఫోర్స్ వార్షిక వేడుకలో గవర్నర్ ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ వేడుకలో బీఎస్ఎఫ్ సిబ్బందికి అసాధారణమైన ప్రతిభ కనబరిచిన సేవలకు రాష్ట్రపతి పోలీస్ మెడల్ లభించింది. భీమయ్యకు అవార్డు పట్ల దళిత సంఘ నాయకులు అభినందించారు.

టిష్యూ ఇంజనీరింగ్ పాత్ర కీలకం

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆధునిక చికిత్సా విధానంలో టిష్యూ ఇంజనీరింగ్ పాత్ర కీలకమని సైటో ల్యాబ్ సహ వ్యవస్థాపకుడు చేతన్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఏపీ నిట్ లోని బయో టెక్నాలజీ ఇంజనీరింగ్ అసోసియేషన్ సహకారంతో బయో ప్రింటింగ్ అండ్ టిష్యూ ఇంజనీరింగ్‌పై విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. బయోటెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సుదర్శన దీప అధ్యక్షత వహించగా చేతన్‌గౌడ్, సైటో ల్యాబ్ బయో ఇంజనీర్ రోహన్‌వ్యాస్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ శరీరంలో దెబ్బతిన్న జీవ కణజాలాల పని తీరును పునరుద్ధరణకు, వాటి ఉత్పత్తిని మెరుగు పరచడానికి టిష్యూ ఇంజనీరింగ్ పద్ధతి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎవరికైనా కిడ్నీలు, కళ్ళు, గుండె సమస్యలు ఉంటే ఆ అవయవ కణజాలాన్ని తీసుకుని బయో ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా ప్రయోగశాలలో కృత్రిమ పద్ధతిలో తయారు చేసి వాటిని అవయవాల స్థానంలో తిరిగి అమర్చుతారన్నారు. రోడ్డు ప్రమాదంలో ఎముకలు విరిగితే బయో సిరామిక్స్ ద్వారా అతికించవచ్చన్నారు. కో ఆర్డినేటర్‌గా ఆచార్యులు డాక్టర్ శారదాప్రసన్న వ్యవహరించారు.

బాలికలు చదువుపై దృష్టి సారించాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బాలికలంతా విద్యపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మాధవరం సెక్టార్ పరిధిలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం చేపట్టారు. మాధవరంలో విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

పెంటపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : బాలికలకు చిన్నవయసులో వివాహాల వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని సీడీపీవో టీఎల్ సరస్వతి అన్నారు. మంగళవారం పెంటపాడు లో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించి పెంటపాడు గేటుసెంటర్ వద్ద మానవహారం నిర్మించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లు సీహెచ్. దుర్గాభవాని, ఎం.సుజాత, జీజీబీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లు రద్దుచేసి, కార్మిక చట్టాలు అమలు చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి కర్రినాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెంలోని అపరాల మార్కెట్ జట్టు యూనియన్ 39వ వార్షికోత్సవంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐటీయు జెండా ఆవిష్కరించారు. నాయకుడు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ కార్మిక చట్టాల అమలుకు దేశవ్యాప్తంగా బుధవారం నిర్వహించే బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్లు బాధ్యతతో మెలగాలి

తణుకు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పాస్టర్లు సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని యునైటెడ్ క్రిస్టియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ. సెయింట్ పాల్ సూచించారు. మంగళవారం తణుకులోని స్పిరిచ్యువల్ లైఫ్ టెంపుల్‌లో జరిగిన తణుకు మండల పాస్టర్స్ అసోసియేషన్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సంఘ గౌరవ అధ్యక్షుడు ఎం జే ప్రేమ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంఘ తణుకు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రక్షితం కాదు.. గరళం !



నగర పంచాయతీ సరఫరా చేసే మంచినీరు తాగడానికి పనికిరాదు. దుర్వాసనతోపాటు మురుగు కలిసిన నీరు వస్తోంది. బయట కొనుగోలు చేసుకొని తాగుతున్నాం. అనేకసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పరిస్థితి మారలేదు.

- కుంకట్ల సత్యనారాయణ, ఆకివీడు

అధికారుల తీరు బాగోలేదు



నగర పంచాయతీ అధికారుల తీరు బాలేదు. సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాదు. ఇసుక మార్చకుండా ఆ నీటినే సరఫరా చేస్తుండడంతో తాగు నీరు దుర్వాసన వస్తోంది. తాగునీటి సరఫరా చేసే పైపులైను మార్చాలి. సిమెంట్ పైపుల ద్వారా సరఫరా చేస్తే రోగాలు బారిన పడతారు. వెంటనే ప్లాస్టిక్ పైపులు వేయాలి.

-పిల్లా బాబులు, జనసేన పట్టణ అధ్యక్షుడు, ఆకివీడు

కౌన్సిల్ సమావేశంలో తీర్మానం



భుజబలరాయుడు మంచినీటి చెరువుల దగ్గరున్న ఫిల్టర్ బెడ్‌లకు కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశాం. టెండర్లు పిలిచి, కాంట్రాక్టరు వచ్చిన తర్వాత ఇసుక మారుస్తాం. డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పరిమళ నుంచి పైపులైన్ పనులు చేపడుతున్నారు. త్వరలో మంచినీటి సమస్య తీరుతుంది.

- జి.కృష్ణమోహన్, నగర పంచాయతీ కమిషనర్, ఆకివీడు



భీమవరంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



కాళ్ళ పీహెచ్‌సీలో వైద్యాధికారి సునీల్‌కు సత్కారం



గణపవరంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

క్యాన్సర్‌పై విజయం.. స్క్రీనింగ్‌తో సాధ్యం

▸▸ ప్రపంచ క్యాన్సర్ దినంలో వక్తలు ▸▸ అవగాహన ర్యాలీలు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై అపోహ వద్దని, సకాలంలో గుర్తిస్తే 90 శాతం వరకు నయం చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.భానునాయక్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై విజయం - స్క్రీనింగ్‌తో సాధ్యం అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. ధనలక్ష్మి, జిల్లా ఎన్‌టీఆర్ ఆరోగ్య సేవా కో-ఆర్డినేటర్ డా. ఎస్.కీర్తి కిరణ్, జిల్లా ఏపిడిమోలాజిస్ట్ జి.సుభాష్, చెరుకువాడ రంగసాయి, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: లక్షణాలను ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌ను సులభంగా తరిమికొట్టవచ్చని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగంనాయుడు అన్నారు. పాలకోడేరు పీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బంది క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిహెచ్‌ఓ సత్యనారాయణ, పిహెచ్‌ఎన్ కుమారి, సూపర్‌వైజర్‌లు శంకర్, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

కాళ్ళ: క్యాన్సర్ కారకాలైన పొగాకు, ఖైనీ, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కాళ్ళ పిహెచ్‌సి డాక్టర్ ఎస్.సునీల్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం సందర్భంగా కాళ్ళ పీహెచ్‌సీలో వైద్యాధికారి సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఉత్తమ వైద్యాధికారి అవార్డును అందుకున్న డాక్టర్ సునీల్‌ను సహచర వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది ఘనంగా సన్మానించారు. వైద్యాధికారులు డాక్టర్ డి.సునీత, డాక్టర్ టి.భావన, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: క్యాన్సర్‌కు భయపడాల్సిన అవసరంలేదని పీఎంపీల అసోసియేషన్ జాతీయ కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. మంగళవారం గణపవరంలోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో మండల అధ్యక్షుడు ఎంఎస్ఎన్‌మూర్తి ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. పీఎంపీల జిల్లా సంఘం అధ్యక్షుడు పరమేశ్వర్లు, మండల అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: సమతుల పోషకాహారంతోనే క్యాన్సర్‌ను అరికట్టవచ్చని నన్నయ్య వర్సిటీ క్యాంపస్ ప్రిన్సిపల్ అశోక్‌కుమార్ సూచించారు. తాడేపల్లిగూడెం నన్నయ్య విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో క్యాన్సర్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తించడం, జీవనశైలిపై వైద్యులు డాక్టర్ జీవీఎస్ఎన్ రాజు, ప్రశాంతి అవగాహన కల్పించారు.



10న అల్బెండాజోల్ మాత్రల పంపిణీ

భీమవరంటౌన్,ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆమె పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడు తూ జిల్లాలో 10న అంగన్వాడి, పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా ఇప్పించాలన్నారు. కడుపులో నులి పురుగులు ఉంటే రక్తహీనత ఏర్పడుతుందన్నారు. జిల్లాలో 3 లక్షల 61 వేల 272 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించామని పిల్లలకు మాత్రలు అందించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాష్ట్రీయ బాల సురక్ష కో-ఆర్డినేటరు బి.భావన, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జి అధికారి డా.బి.భానూ నాయక్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో- ఆర్డినేటరు డాక్టర్ జి. కీర్తి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించవద్దని రాస్తారోకో

ఆకివీడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలో చెరువులు, పంట, మురుగు కాల్వల వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం స్థానిక ధర్మాపురం అగ్రహారంలో మంచినీటి చెరువు చుట్టూ ఉన్న 33 కుటుంబాల ఆక్రమణదారుల ఇళ్ళను పోలీసులు సమక్షంలో జేసీబీతో తొలగిస్తుండగా అడ్డుకొని ఆయా కుటుంబాలు రాస్తారోకో చేపట్టాయి. బుధవారం రాత్రిలోపు ఖాళీ చేయకపోతే గురువారం భారీ బందోబస్తుతో వచ్చి ఖాళీ చేయిస్తామని హెచ్చరించారు. బాధితులు తమకు మరింత గడువు కావాలనడంతో ఇప్పటికే అనేక సార్లు సమయం ఇచ్చామన్నారు. అగ్నిమాపక, విద్యుత్‌శాఖ అధికారులతో పాటు సీఐ జగదీశ్వరరావు, ఎస్ నాగరాజు, నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు, శా నిటరీ ఇన్‌స్పెక్టర్ సాకేత్ పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

యలమంచిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన చెల్లుబోయిన లీలాసత్యశ్రీనాథ్ ఉన్నత చదువులకు ఉపాధ్యాయుడు మేడిశెట్టి గణేష్, ఉపాధ్యాయిని కుక్కల గీతాకల్యాణి, విద్యా చైతన్య సమాఖ్య సంస్థలు ఒక్కొక్కరూ రూ.20వేలు చొప్పున మొత్తం రూ.60వేలు నగదును మంగళవారం అందజేశారు.

ఆక్వా రైతుల కోసం బీమా



మాట్లాడుతున్న ఫిషరీస్ జేడీ

ఉండి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం బీమా పథకాన్ని ప్రవేశ పెట్టిందని ఫిషరీస్ జేడీ ఎస్‌కె లాల్ మహమ్మద్ అన్నారు. మంగళవారం వాండ్రంలోని ఆక్వా అసోసియేషన్ ఫార్మర్స్ బిల్డింగ్‌లో ఎన్ఎఫ్‌డిబి, మత్స్యశాఖల ఆధ్వర్యంలో ఆక్వారైతులకు బీమా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డా.లాల్ మహమ్మద్ మాట్లాడుతూ సన్న చిన్నకారు రైతులకు ఈ బీమా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం రూ. 975 కోట్లు ఆక్వారైతులకు సబ్సిడిని అందిస్తుందన్నారు. ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్‌లను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఎంపెడా లైసెన్సు వుంటే ఆక్వారైతులకు ఎటువంటి ఇబ్బందులు వుండవన్నారు. ఎన్ఎఫ్‌డిబి ఎగ్జిక్యూటివ్ డా.సుష్మ, జిల్లా ఫిషరీస్ అధికారి ప్రసాద్, భీమవరం ఏడి ఎల్ఎల్ఎన్ రాజు, ఎంపెడా టెక్నీషియన్ దుర్గారావు, ఆక్వా అసోసియేషన్ అధ్యక్షుడు జికెఎప్ సుబ్బరాజు, ఆక్వా రైతులు, ఇన్సూరెన్స్ అధికారులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులు ఐక్యంగా ఉండాలి

పాలకోడేరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాయీ బ్రాహ్మణులంతా ఐకమత్యంగా ఉంటూ సొంత భవనాలు నిర్మించుకుని సంఘాలుగా ఏర్పడాలని జిల్లా అధ్యక్షులు కొడవర్తి శివ ప్రసాద్ అన్నారు. శృంగవృక్షం గ్రామంలో శ్రీ చైతన్య నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన కమ్యూనిటీ భవనాన్ని మంగళవారం నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు ప్రారంభించారు. గ్రామంలోని బూరాబత్తుల సత్యనారాయణ, కలిదిండి కృష్ణంరాజు గ్రామస్తుల సహకారంతో భవనాన్ని నిర్మించుకుని దానిని ప్రారంభించుకోవడం అభినందనీయమని కొడవర్తి శివప్రసాద్ అన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్పీ

అతి వేగం ప్రమాదకరం

భీమవరం క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అతివేగం ప్రమాదకరమని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వద్దని వక్తలు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రత, ప్రమాదాలపై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు భీమవరం టౌన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భీమవరం ఏఎంసీ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్డులో ఆటోలతో నిర్వహించిన భారీ ప్రదర్శనను జిల్లా అడిషనల్ ఎస్పీ భీమారావు ప్రారంభించారు. అనంతరం మార్కెట్ యార్డులో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథులుగా డీటీవో ఉమామహేశ్వరరావు, భీమవరం డీఎస్పీ జయసూర్య మాట్లాడుతూ మనతోపాటు ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యాలను చేర్చడం సామాజిక బాధ్యత అని, ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ పది మందికి ఆదర్శంగా నిలవాలన్నారు. సభకు భీమవరం ఆటో యూనియన్ అధ్యక్షుడు ఇంటి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, రవికుమార్, టూటౌన్ సిఐ కాళీచరణ్, ట్రాఫిక్ సీఐ నారాయణమూర్తి ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ ఎస్ఐ గగారిన్, మోటార్ వెహికల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుండె వైద్య నిపుణుడు సోమరాజు

జీవన శైలిపైనే ఆరోగ్యం ఆధారం..

ఆకివీడు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవన శైలిపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు భూపతిరాజు సోమరాజు అన్నారు. సిద్ధాపురంలో భూపతిరాజు శ్రీదేవి జ్ఞాపకార్థం, గ్లోబల్ ట్రస్టు, భీమవరం వర్మ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మెగా క్యాంపుల లోనే కాక ట్రస్టు ద్వారా మిగిలిన సమయాలలోనూ వర్మ హాస్పిటల్స్‌లో ఉచితంగా వైద్య సేవలందిస్తున్నట్లు డాక్టర్ వర్మ తెలిపారు. క్యాన్సర్‌కు బసవ తారకం హాస్పిటల్స్, కంటికి ఎల్‌వి ప్రసాద్, పళ్ళకు విష్ణు డెంటల్ కాలేజీలలో ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు యోగేంద్ర బాబు తెలిపారు. 364 మందికి వైద్యసేవలందించినట్లుగా సిద్ధాపురం ట్రస్టు ఇన్‌ఛార్జి భూపతి రాజు వెంకటేశ్వరరాజు తెలిపారు. భూపతిరాజు తిమ్మరాజు, కన్నయ్యరాజు, అంజి, రాధాకృష్ణరాజు, జెకెరాజు, శ్రీధర్, కనుమూరు రామకృష్ణరాజు, వర్మ హాస్పిటల్స్ వైద్యులు పాల్గొన్నారు.



సూర్య నమస్కారాల పోటీలు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) :రథసప్తమి సందర్భంగా సంస్కార భారతి ఆధ్వర్యంలో భీమవరంలోని పలు పాఠశాలల విద్యార్థులకు స్థానిక డీఎన్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో సూర్య నమస్కార పోటీలు నిర్వహించారు. ముందుగా భారతమాత, సూర్యభగవానుడి చిత్ర పటాలకు పూలమాలలు వేశారు. మొదటి బహుమతి భారతీయ విద్యా భవన్స్ కి చెందిన విద్యార్థినీ గ్రీష్మ, ద్వితీయ బహుమతి ఏసి హెచ్ బీ ఆర్ ఎమ్ స్కూల్ విద్యార్థినీ మౌనిక, మూడో బహుమతి పిఎస్ఎమ్ స్కూల్ విద్యార్థినీ కిరణ్మయి దక్కించుకున్నారు. సంస్కార భారతి కన్వీ నర్ డాక్టర్ చెట్లపల్లి జగన్ మోహన్, ఆర్ ఎస్ ఎస్ జిల్లా ప్రచారక్ రఘురామ్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తణుకు: ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో విద్యార్థినులు సూర్య ఆరాధన, యోగస నాలు నిర్వహించారు. యోగా ట్రైనర్ కె.కార్తి, కళాశాల కార్య దర్శి చిట్టూరి సత్య ఉషారాణి, ప్రిన్సిపల్ లక్ష్మీసుందరీబాయ్ పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: రథసప్తమి సందర్భంగా రోటరీ క్లబ్ పాలకొల్లు ఆధ్వర్యంలో మంగళవారం పాలకొల్లు క్షీరపురి యోగ సత్సంగం నందు 60 మంది సభ్యులు 108 సూర్య నమస్కారాల యజ్ఞం చేశారు. 108 సూర్యనమస్కారాలు చేసిన 60 మంది సభ్యులకు రోటరీ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు రావాడ సతీష్, కార్యవర్గ సభ్యులు అభినందన జ్ఞాపికలను అందజేశారు.

'పేదలకు భారం.. సంపన్నులకు వరం'

పెనుగొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ సామాన్యులపై భారం, సంపన్నులకు వరాలు కురిపించారని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పెనుగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.



పాలకొల్లులో ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్ల నిరసన

బీమాలో విదేశీ పెట్టుబడులు వద్దు

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పరిమితిని 74 నుంచి 100శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ద్వారా ప్రకటించడాన్ని నిరసిస్తూ పాలకొల్లు ఎల్ఐసి కార్యాలయం వద్ద బీమా ఉద్యోగులు, ఏజెంట్లు మంగళవారం భోజనవిరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీమా శాఖ అధ్యక్షుడు సిహెచ్.మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రతిపాదనలు దేశ ఆర్థిక స్వావలంబనకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్య తరగతి ప్రజల ముఖ్య పొదుపు మార్గం, వారి కుటుంబాలకు రక్షణ కల్పిస్తున్న బీమా రంగాన్ని విదేశీ పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి సురేంద్రన్, ఏలియా, బాలాజీ, నాళం బాపిరాజు, న్యూటన్ పాల్గొన్నారు.


గీత కార్మికుల అభివృద్ధిని జీర్ణించుకోలేని జగన్

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10శాతం రిజర్వేషన్ కూటమి ప్రభుత్వం ప్రకటించి అమలు చేయడం పట్ల మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జీర్ణించుకోలే తన మనుషులతో సుమారు 30 రిట్ పిటిషన్లు దాఖలు చేయించి బీసీల పట్ల ఆయనకున్న వ్యతిరేకతను మరోసారి బయట పెట్టుకున్నారని రాష్ట్ర టీడీపీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి కడలి గోపాలరావు మండిపడ్డారు. పాలకొల్లులో ఆయన నివాసగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు.

పాఠశాలకు ఫ్యాన్లు, కుర్చీల బహూకరణ

తణుకు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండపాక జడ్పీ హైస్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం రావులపాలెం, ఐడీబీఐ బ్యాంక్ బ్రాంచి, గ్రామానికి చెందిన ఆత్మకూరి రామకృష్ణ ఆర్థిక సాయంతో పాఠశాలకు రూ. 75 విలువైన ఫ్యాన్లు, కుర్చీలు, కంప్యూటర్ టేబుల్స్‌ను బహూకరించినట్లు హెచ్‌ఎం ఆర్ మోహన్‌బాబు తెలిపారు. ఐడీబీఐ బ్రాంచి మేనేజర్లు రమేష్, కార్తీక్, డీసీ ఛైర్మన్ యల్లపరాజు తదితరులు పాల్గొన్నారు.

జైన్ దేవుని ఆలయ వార్షికోత్సవం



భజనలు చేస్తున్న జైన్ భక్తులు

ఆచంట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం కొడమంచిలిలో ఉన్న నాగేశ్వర పార్శ్వనాథ్ జైన్‌దేవుని 3వ వార్షికోత్సవం మంగళవారం వేడుకగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది జైన్‌భక్తులు పెద్ద ఎత్తున వచ్చి జైన్‌దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైన్‌దేవుని ఆలయం భక్తులతో కిటకిటలాడింది.



నరసాపురంలో సూర్యదేవాలయం వద్ద భక్తులు క్యూ

భక్తిశ్రద్ధలతో రథసప్తమి

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లలితాంబ రేవు వద్ద గల సూర్యదేవాలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. దంపతులు స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం అన్న సమా రాధన జరిగింది. వైఎస్‌పాలెం వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్ని రథంపై గ్రామంలో ఊరేగించారు. సర్పంచ్ నాగముత్యమాంబ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి వనువులమ్మ, మారెమ్మ ఆలయం వద్ద రథసప్తమి పూజలు చేశారు. ముందుగా అమ్మవార్లకు పంచామృతాభిషేకాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆవుపాలతో ప్రత్యేకంగా పరమాన్నం వండి మహిళలకు ప్రసాదాలు అందించారు. ఆలయ నిర్వాహకుడు బండి శ్రీనివాస్ దంపతులు, మహిళలు పాల్గొన్నారు.

తణుకు: మంగళవారం రథసప్తమి సందర్భంగా పట్టణంలోని సూర్య దేవాలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కృష్ణతులసి దంపతులు పూజలు నిర్వహించారు. ఈవో ముత్యాల సత్యనారాయణ, కమిటీ నాయకులు గమిని రాములు స్వాగతం పలికారు. కాగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కాళ్ళ: సీసలి గ్రామంలో వేంచేసియున్న షిరిడీ సాయిబాబా వారికి రథసప్తమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి 18 రకాల హారతులు, ఆదిత్య పారాయణం నిర్వహించారు. పంచామృత స్నానం నిర్వహించారు. స్వచ్ఛమైన కపిలగోవు పాలతో సూర్యభగవానుడికి ప్రీతికరమైన పాయసాన్ని గోవు పిడకలపై వండి బాబావారికి ప్రసాదంగా నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్‌పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతిదేవి పర్యవేక్షించారు.



తణుకు సూర్య దేవాలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి పూజలు

అత్తిలి: అత్తిలి విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ భవనంలో యోగా కార్యక్రమంలో భాగంగా రథసప్తమి సందర్భంగా సూర్య నమస్కారాలు చేశారు. యోగా గురువు బండి శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ పొందేవారు సూర్యనమస్కారాలు చేశారు. పెద్ద సంఖ్యలో యోగా అభ్యాసకులు పాల్గొన్నారు. బల్లిపాడు మదనగోపాల్ మోడల్ స్కూల్లో రథ సప్తమి సందర్భంగా యోగా గురువు బండి శ్రీనివాస ప్రసాద్ విద్యార్థులకు సూర్య నమస్కారాలు, యోగాసనాలు నేర్పించారు. పాఠశాల డైరెక్టర్ తిరుపతి శ్రీనివాస్, సిబ్బంది ప్రసాద్‌ను సన్మానించారు.

ఇంటర్వ్యూ..

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



డాక్టర్ అనిల్ కుమారి, వ్యవసాయ శాఖ ఏడీఈ

- **మీ పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?**

జవాబు: మూడు. నరసాపురం, మొగల్తూరు, యలమంచి.

- **రైతు కేంద్రాల్లో ఎరువుల స్టాక్ ఎంత ఉంది?**

జవాబు: 300 టన్నుల వరకు ఉంది.

- **ఎరువులు ఎంత ధరకు విక్రయించాలి?**

జవాబు: రూ. 266కు. ఇదే ధరకు ప్రైవేట్ డీలర్లు విక్రయించాలి. ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు తీసుకుంటాం.

- **ఎరువుల కొరత ఉందా?**

జవాబు: ప్రస్తుతం లేదు. అవసరమైన సొసైటీలకు ఎరువులను సరఫరా చేస్తున్నాం.

(ఆంధ్రజ్యోతి-నరసాపురం రూరల్)

రేపు ట్రస్టు ఆసుపత్రికి స్పెషలిస్టులు

పెంటపాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 6న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, గొంతు సంబంధ వైద్యులు వస్తారన్నారు. రక్తపరీక్షలతో పాటు ఈసీజీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా గోపాలన్

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ప్రస్తుత జిల్లా కార్యదర్శిగా ఉన్న జెఎన్‌వి గోపాలన్ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. నెల్లూరులో జరిగిన రాష్ట్ర 27వ మహాసభల్లో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక కాగా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా తాను ఎన్నికైనట్లు గోపాలన్ తెలిపారు. గోపాలన్ జనవరిలో జరిగిన జిల్లా మహాసభల్లో జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఇప్పుడు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం

తణుకు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు అధిక ప్రాధాన్య మిచ్చిందని ఆడిటర్ జె.ఎస్.సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో వాణిజ్య, అర్థశాస్త్రం విభాగాలు సంయుక్తంగా బడ్జెట్‌పై సెమినార్ నిర్వహించారు. ఆదాయ పన్ను విషయంలో వేతన ఉద్యోగులకు భారీ ఊరట లభించిందన్నారు. అయితే రైతులకు అంతగా చెప్పుకోదగిన ఫలితాలు లభించలేదన్నారు. జీఎస్టీలో ఎక్కువ మార్పులు జరగలేదని వివరించారు. ప్రిన్సిపాల్ యు. లక్ష్మీసుందరీ బాయ్, సత్యకిరణ్, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్ కనెక్షన్ వితరణ

ఆకివీడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇంటర్నెట్ సదుపాయం ఎంతగానో ఉపయోగపడుతుందని రైన్‌బో సంస్థ సభ్యుడు పేరూరి రాధాకృష్ణ అన్నారు. మాదివాడ శాఖా గ్రంథాలయంలోని కంప్యూటర్లకు రైన్‌బో సంస్థ ఇంటర్నెట్ సదుపాయంతో పాటు ఏడాదిపాటు చందా చెల్లించి మాట్లా డారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరం అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, అధికారి పా ర్వతి, రైన్‌బో సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ సేవా కార్యక్రమాలు

ఆకివీడు రూరల్ ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆకివీడు మండలం దుంప గడప గ్రామంలో పలు సేవా కార్యక్రమాలలో లయన్స్ డ్రిస్టిక్ గవర్నరు కాకరాల వేణుబాబు పాల్గొన్నారు. దుంపగడపలోని శ్రీవరదరాజ స్వామి దేవస్థానంలో రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వృద్ధులు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేసారు. వీవీ గిరి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థినుల కోసం శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ మిషన్‌ను ప్రారంభించారు. కాలేజీ అభివృద్ధి కోసం రూ.10వేలు అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు రాజరాజేశ్వరి, జ్యోతి రెడ్డి, గొంట్లా కృష్ణమూర్తి, పడవలరాజు, మోటుపల్లి శ్రీను, సుబ్బరాజు, దిలీప్, చెంచయ్య, సతీష్, గుర్రం శ్రీను, కందుల అప్పారావు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలివ్వాలి

ఇరగవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులకు వడ్డీలేని రుణాలను మంజూరు చేయాలని సీఐటీయూ నాయకుడు కామన మునిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం రేలంగిలో యూనియన్ అధ్యక్షులు నాగబాబు అధ్యక్షతన ఆటో యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రభుత్వం స్పేర్ పార్టుల ధరలను తగ్గించాలని, బీమా ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మొగల్తూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కంటి సమస్యల్ని నిర్లక్ష్యం చేయవద్దని డాక్టర్ శ్రీనివాసరాజు కోరారు. మొగల్తూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీనివాస ఆసుపత్రిలో ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పాలకొల్లుకు చెందిన రాధా రమణి లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 48 మందికి పరీక్షలు నిర్వహించగా 18 మందికి ఆపరేషన్‌లు అవసరమైనట్లు గుర్తించారు.